క్లుప్తంగా

విద్యుత్ ఈఈగా పి.యుగంధర్



రాయచోటి టౌన్ : రాయచోటి విద్యుత్ సంస్థ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పి.యుగంధర్ బాధ్యతలు చేపట్టారు. బుధవారం ఆయన రాయచోటి విద్యుత్ సంస్థ కార్యాలయానికి చేరుకోగానే ఆ సంస్థలోని సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. అనంతరం మంత్రి మండిపల్లిని మర్యాదపూర్వకంగా కలిశారు.

పాలిటెక్నిక్ అధ్యాపకురాలికి డాక్టరేట్



బొమ్మి హారిక

ఓబులవారిపల్లె : మండల కేంద్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల అధ్యాపకురాలు బొమ్మి హారికకు తిరుపతి శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసింది. కంప్యూటర్ సైన్స్ ఆచార్యులు డాక్టర్ సుధా పర్యవేక్షణలో అనాలసిస్ ఆఫ్ వెబ్ యూసేజ్ మైనింగ్ బేస్డ్ ఆన్ వెబ్ లాగ్ డేటా అనే అంశంపై పరిశోధనలు నిర్వహించినందుకు హారికకు డాక్టరేట్ వరించింది. దీంతో తోటి అధ్యాపకులు, విద్యార్థులు, బంధువులు హారికను అభినందించారు.

నేడు మెడికల్ అసెస్‌మెంట్ క్యాంపు

చిట్వేలి : మండలంలోని దివ్యాంగులందరికీ (6 నుంచి 60 సంవత్సరాల వరకు)ఉపకరణాలకు (నేడు) మంగళవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో మెడికల్ అసెస్‌మెంట్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. యూడీఐడీ కార్డు, సదరం సర్టిఫికెట్, ఆధార్ కార్డు, రేషన్ కార్డు, రెండు ఫొటోలు క్యాంపునకు తీసుకురావాలని సూచించారు. వివరాలకు మండల ఉపాధ్యాయులు వెంకట సుబ్బయ్య – 9490620447, శిరీష – 8501895665లను సంప్రదించాలన్నారు.

వీరభద్రుడి సన్నిధిలో డీఎస్పీ కృష్ణమోహన్



డీఎస్పీ కృష్ణమోహన్‌కు స్వాగతం పలుకుతున్న అర్చకులు

రాయచోటి టౌన్ : రాయచోటి డివిజన్ డీఎస్పీగా బాధ్యతలు చేపట్టిన ఎంఆర్ కృష్ణమోహన్ శ్రీ భద్రకాళీ సమేత వీరభద్రస్వామిని దర్శించుకున్నారు. ఆలయ ఈఓ డివి రమణారెడ్డి ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు కృష్ణయ్య స్వామి, శంకరయ్యస్వామి, శేఖర్ స్వామి, ఆలయ వేదపండితులు రాచరాయ యోగీ స్వామి ఆధ్వర్యంలో డీఎస్పీని పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. కాగా ఆలయంలో మూడు పూటల భక్తులకు ఉచితంగా అన్నప్రసాదాన్ని అందిస్తున్నారు.

నేడు కొత్తపల్లికి మంత్రి రాక

చిన్నమండెం : మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామంలో మంగళవారం జరిగే పొలం పిలుస్తోంది కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి హాజరుకానున్నారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చటానికి రాష్ట్ర ప్రభుత్వం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని మండల వ్యవసాయాధికారిణి గీత తెలిపారు. ఈ కార్యక్రమానికి వ్యవసాయ శాఖకు చెందిన అధికారులు, సిబ్బంది హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆమె కోరారు.

గిరిజనులకు పాస్ పుస్తకాలు ఇవ్వాలి

రైల్వేకోడూరు అర్బన్ : మండలంలోని కె.బుడుగుంటపల్లి పంచాయతీ సమతా నగర్‌లో ఉన్న గిరిజనులకు ఇచ్చిన సాగు భూమికి పాస్ పుస్తకాలు ఇచ్చి ఆన్‌లైన్ చేయాలని సీపీఐ మండల కార్యదర్శి దార్ల రాజశేఖర్ ఇన్‌చార్జ్ తహసీల్దార్ రెడ్డి ప్రసాద్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో గిరిజన రైతులు పాల్గొన్నారు.

నేడు 'పొలం పిలుస్తుంది'

రైల్వేకోడూరు అర్బన్ : మండలంలోని ఓబనపల్లి పంచాయతీ రైతు సేవా కేంద్రంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఏడీ కవిత సోమవారం తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే అరవ శ్రీధర్ తదితరులు పాల్గొనున్నట్లు వారు పేర్కొన్నారు. పంట పొలాలు పరిశీలించి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులకు వివరించడం జరుగుతుందని తెలియజేశారు.

2న మహాలయ పితృ తర్పణాలు

కడప కల్చరల్ : సమైక్య బ్రాహ్మణ సమాఖ్య సంస్థ , అర్చక పురోహితుల సంఘం, జిల్లా బ్రాహ్మణ సంఘంతో కలిసి అక్టోబరు 2న మహాలయ పక్ష అమావాస్య సందర్భంగా పెద్దలకు తిలా తర్పణం చేయనున్నామని సంస్థ ప్రతినిధులు పిడతల గోపాలకృష్ణశర్మ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులకు ఈ విషయాలు తెలిపారు. ఉదయం 10 గంటలకు కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని, హాజరయ్యే వారు సంబంధిత సామగ్రిని వెంట తెచ్చుకోవాలన్నారు. చిన్నచౌక్ సమీపంలోని గాయత్రి సదన్‌లో ఈ కార్యక్రమం ఉంటుందని చెప్పారు.

ఎండుతున్న పంటలు.. మండుతున్న గుండెలు

మండలంలో రైతాంగం నిండా నష్టపోయారు. వరుణుడు ఖరీఫ్‌లో కరుణించకపోవడంతో మండల వ్యాప్తంగా కరువు విలయతాండవం చేస్తోంది. రైతులు విత్తిన విత్తనాలు ఎండ తీవ్రతకు తట్టుకోలేకపోతుండటంతో పంటకు నీరు అందించలేక, భూగర్భ జలాలు అడుగంటడంతో చేనులోని పంటను అలానే వదిలేశారు. పెట్టిన పెట్టుబడి కూడా దక్కని పరిస్థితులు కనబడకపోవడంతో రైతుల బాధలు అరణ్య రోధనలుగా మిగులుతున్నాయి. కాగా మండలంలోని నారాయణ రెడ్డిపల్లెలో రైతు నాగరాజు తన వేసిన వరికి ట్యాంకర్ల సాయంతో నీరు అందిస్తూ పంటను కాపాడుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. గతం కంటే ఈ ఏడాది ఖరీఫ్‌లో సాగు గణనీయంగా పడిపోయిన సంగతి తెలిసిందే. ప్రభుత్వం తమను ఆదుకోకపోతే తాము అప్పులపాలు అవ్వాల్సిందేనని రైతులు వాపోతున్నారు.

– సంబేపల్లి



నారాయణరెడ్డిపల్లె పంచాయతీలో ట్యాంకర్ ద్వారా వరిమడికి నీటిని అందిస్తున్న రైతు



మోటకట్ల సమీపంలో ఎండిపోయిన వేరుశనగ పంట



నగిరి రోడ్డు సమీపంలో ఎండిపోయిన వరిపంట

ప్రజా సమస్యలు తక్షణమే పరిష్కరిస్తాం

పుల్లంపేట : కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు పురస్కరించుకొని సోమవారం పుల్లంపేటలోని ఎస్‌వీ కల్యాణ మండపంలో ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా దర్బార్‌లో కార్యక్రమంలో సమస్యలు వెంటనే పరిష్కరిస్తామని ఎమ్మెల్యే అరవ శ్రీధర్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రేషన్ కార్డుల సమస్యలు, భూముల సర్వే, పింఛన్లు, తాగునీటి సమస్య, రోడ్లు తదితర సమస్యలపై ఎమ్మెల్యేకు ప్రజలు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ అరవింద కిషోర్, విద్యుత్ శాఖ ఏఈ చంద్రశేఖర్, ఏఓ హబీబుల్లా, ఈఓపీఆర్డీ పెంచలయ్య, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులకు శ్రీకారం

ఓబులవారిపల్లె : మండల పరిధిలోని కాకర్లవారిపల్లెలో దాదాపు రూ. 7.52 కోట్ల వ్యయంతో పక్కా రోడ్డు పనులను సోమవారం ఎమ్మెల్యే అరవ శ్రీధర్, టీడీపీ ఇన్‌చార్జ్ ముక్కా రూపానందరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైల్వేకోడూరు నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా దాదాపు రూ. 7.50 కోట్లతో కాకర్లవారిపల్లిలో కిలోమీటర్, తుమ్మకొండ నుంచి చిన్నఓరంపాడు వరకు తారురోడ్డు వేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పీఆర్ డీఈ బాల నరసింహులు, సాయివికాస్‌రెడ్డి, బత్తిన వేణుగోపాల్ రెడ్డి, శివయ్య నాయుడు తదితరులు పాల్గొన్నారు.



ఓబులవారిపల్లె : రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అరవ శ్రీధర్

ప్రజా వ్యతిరేక విధానాలు విడనాడాలి

రాయచోటి అర్బన్ : కేంద్ర – రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను వెంటనే విడనాడాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎ.రామాంజులు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి వంగిమళ్ల రంగారెడ్డిలు డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 23 బ్లాక్ డేను పురస్కరించుకుని రెవెన్యూ కార్యాలయం వద్ద ఉన్న అంబేడ్కర్ ఫ్లెక్సీ వద్ద కార్మిక, రైతు సంఘాల నేతలు ప్లకార్డులు చేతబట్టుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులను కట్టుబానిసలుగా మార్చే విధానాలను రద్దుచేయాలన్నారు. నల్లచట్టాలను అమలులోకి తీసుకురావడం ద్వారా రైతుపొలంలో రైతే కూలీగా పనిచేసే పరిస్థితిని తీసుకురావడం దుర్మార్గమన్నారు. వైజాగ్ స్టీల్ ఫ్యాక్టరీ ప్రైవేటీకరణ యత్నాలను వెంటనే ఆపాలన్నారు. కేంద్ర – రాష్ట్ర ప్రభుత్వాలు తమ విధానాలను మార్చుకునేంతవరకు పోరాటాలు సాగిస్తూనే ఉంటామన్నారు. కార్యక్రమంలో రైతునేతలు ఈశ్వరయ్య, జానకయ్య, కార్మిక నేతలు మాధవయ్య, ఆంజనేయులు, రమేష్, వాసుల, కాంగ్రెస్‌నేత చెన్నక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.



నిరసన ప్రదర్శనలో ప్రజా సంఘాల నేతలు

కనీస వేతనం అమలుచేయాలి



టోల్‌గేట్ వద్ద నిరసన తెలుపుతున్న సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు

రైల్వేకోడూరు అర్బన్ : లేబర్ కోడ్ చట్టాలను కేంద్ర ప్రభుత్వం రద్దు చేయడమే కాక కార్మికులకు రూ.26 వేల కనీస వేతనం అమలు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నరసింహులు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక టోల్ గేట్ వద్ద రాస్తారోకో నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లేబర్ కోడ్ చట్టాలను రద్దు చేయాలనే డిమాండ్‌తో కార్మికులు దేశ వ్యాప్తంగా ఉద్యమాలు చేస్తున్నా కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. కార్మికుల వ్యతిరేక వైఖరిని విడనాడి వారి సంక్షేమానికి కృషి చేయాలని చెప్పారు. కార్యక్రమంలో తుమ్మల రాధాకృష్ణ, పండుగోలు మణి, రాజశేఖర్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌జీఎఫ్ పోటీల్లో విద్యార్థుల సత్తా



రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపల్

సంబేపల్లె : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నిర్వహిస్తున్న క్రీడా పోటీల్లో ఆదర్శ పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. అండర్19 విభాగంలో జరిగిన క్రీడల్లో విద్యార్థులు ప్రతిభ చూపి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు ప్రిన్సిపల్ దిలీప్ కుమార్, ఫిజికల్ డైరెక్టర్ షామీర్‌బాషాలు సోమవారం తెలిపారు. ఈనెల 12న వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరు జార్జ్ క్లబ్‌లో జరిగిన యోగా పోటీల్లో ప్రవీణ్‌కుమార్, అహమ్మద్, జశ్వంత్, ఏపీఎస్ఆర్‌డబ్ల్యూ గండి క్షేత్రంలో ఈనెల 13న జరిగిన రగ్బీ పోటీలలో వెన్నల, నెట్‌బాల్ విభాగంలో నరేంద్రనాయక్, 17న కడప స్పోర్ట్స్ స్కూల్‌లో జరిగిన మాడరన్ పెంతలాన్ క్రీడలో శర్వాణి, రూహిన్, లోకేష్‌బాబు, గణేష్, స్విమింగ్ విభాగంలో నాగేంద్రనాయుడు, 20న మేధా డిఫెన్స్ అకాడమీలో జరిగిన బాల్ బాడ్మింటన్ పోటీలలో గౌరీ గణేష్, మల్లి, కాంబ్ పోటీలలో సాయి చందు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలియజేశారు. రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయులు, సిబ్బంది, తోటి విద్యార్థులు అభినందించారు.

విధులను బహిష్కరించిన ప్రభుత్వ వైద్యులు

అవస్థలు పడుతున్న రోగులు

వీరబల్లె : ప్రభుత్వ డాక్టర్ల ధర్నాలలో ఉంటూ విధులకు హాజరుకాకపోవడంతో రోగాలతో బాధపడుతున్న ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సోమవారం మండల కేంద్రంలో ఉన్న ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న ఇద్దరు వైద్యులు విధులకు హాజరుకాలేదు. దీంతో చికిత్స కోసం సుండుపల్లె పీహెచ్‌సీకి వచ్చిన రోగులు నిరాశతో వెనుదిరిగారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో వైద్యులు, వైద్య సిబ్బంది 24 గంటలు పనిచేయాల్సి ఉంది. వైద్యుల గైర్హాజరుపై ఆరా తీయగా జీఓ 85ని తీసుకురావడాన్ని వ్యతిరేకిస్తూ విధులు బహిష్కరించామన్నారు. ఈ జీఓతో గ్రామీణ ప్రాంతాల్లో సేవలందించే తమకు ఉన్నత విద్యను అందించేందుకు తమకు ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. ప్రభుత్వం జీఓను వెనక్కి తీసుకునే వరకు ఆందోళనలు కొనసాగిస్తామని ఈ సందర్భంగా తెలియజేశారు.



వైద్యులు లేకపోవడంతో ఖాళీగా ఉన్న ఆస్పత్రి

సృజనాత్మకత, నైపుణ్యాన్ని మెరుగుపరుచుకోవాలి

రాజంపేట : సృజనాత్మకత, నైపుణ్యాన్ని విద్యార్థులు మెరుగుపరుచుకోవాలని సినీనటుడు, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ ట్రైనర్ కేవీ ప్రదీప్ అన్నారు. సోమవారం అన్నమాచార్య యూనివర్సిటీలో వ్యక్తిత్వ వికాస సదస్సులో ఆయన పాల్గొని ప్రసంగించారు. స్వాట్ అనాలిసిస్‌పై అవగాహన కల్పించుకోవాలన్నారు. మనిషి మెదడులో అంతులేని సమాచారం నిల్వ ఉంచుకోవచ్చన్నారు. ఈ విషయాన్ని ప్రతి విద్యార్థి గ్రహించాలన్నారు. కొత్తదనం, నమ్మకం, ఏకాగ్రత, నాయకత్వ లక్షణాలు, వాక్‌చాతుర్యతల ఆవశ్యకతను విద్యార్థులు తెలుసుకోవాలన్నారు. అన్నమాచార్య యూనివర్సిటీ చాన్స్‌లర్ చొప్పా గంగిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు విద్యతోపాటు నేటి పరిస్థితులలో అవలంభించాల్సిన విధానాలు, పోటీతత్వాన్ని తట్టుకునే విధంగా కార్యక్రమాలను రూపొందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఏఐటీఎస్ వైస్‌చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి, ప్రిన్సిపాల్ డా.నారాయణ, ఏయూ డీన్ ఆఫ్ స్టూడెంట్ డా.ఎం.సుబ్బారావు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న సినీనటుడు కేవీ ప్రదీప్

ఫార్మసీ రంగానికి అధిక ప్రాధాన్యత

నేటి సమాజంలో ఫార్మసీ రంగానికి అధిక ప్రాధాన్యత సంతరించుకుందని ఏయూ అధినేత చొప్పా గంగిరెడ్డి అన్నారు. సోమవారం అన్నమాచార్య ఫార్మసీ కళాశాలలో జాతీయ ఫార్మాకో విజిలెన్స్ వారం–2024 ఉత్సవాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫార్మసీ విద్యతో ఉజ్వలభవిష్యత్తు ఉంటుందన్నారు. ప్రిన్సిపల్ స్వర్ణలత మాట్లాడుతూ ఔషధ దుష్ఫలితాలపై విద్యను అభ్యసించే విద్యార్థులకు జ్ఞానాన్ని పెంపొందించుటకు క్విజ్ నిర్వహించామన్నారు. ఔషధాల వాడకం, దాని మంచిఫలితాలు, దుష్పరిణామాలపై విద్యార్థులు పట్టుసాధించిగలినప్పుడే ఫార్మసీ విద్యకు సార్థకత అన్నారు. కార్యక్రమంలో నిర్వహణాధికారి డా.గిరి రాజశేఖర్, చొప్పా ఎల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన క్విజ్ విజేతలకు ప్రశంసాపత్రాలను అందజేశారు.

గ్రామాల అభివృద్ధి ప్రణాళికలు రూపొందించండి

సిద్దవటం : మండల విజన్ డాక్యుమెంట్ రూపకల్పనలో అధికారులు, సచివాలయ సిబ్బంది కీలకంగా వ్యవహరించాలని మండల ప్రత్యేకాధికారి జయసింహ కోరారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో సిబ్బందితో స్వర్ణాంధ్ర విజన్–2047పై అవగాహన కల్పించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఎడ్యుకేషన్, హెల్త్‌కేర్, వ్యవసాయం, రెనవబుల్ ఎనర్జీ, టూరిజంపై 5 సంవత్సరాలకు సంబంధించి ప్రణాళికలు రూపొందించాలన్నారు. అనంతరం అధికారులు స్వర్ణాంధ్ర విజన్ 2047 పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జవహర్ బాబు, డిప్యూటీ తహసీల్దారు మాధవీలత, ఏఓ రమేష్‌రెడ్డి, ఎంఈఓ విలియంరాజు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మానస, విద్యుత్ ఏఈ జయచంద్ర, హౌసింగ్ ఏఈ చెన్నయ్య, పశు వైద్యాధికారి శివశంకర్, ఏఎస్ఓ శివప్రసాద్, ఉపాధి ఏపీఓ నరసింహులు, వెలుగు ఏపీఎం వెంకటేశ్వర్లు, గ్రామ కార్యదర్శులు, వీఆర్ఓలు, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.



విజన్ 2047 పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అధికారులు

పౌష్టికాహారంతోనే గర్భిణులకు ఆరోగ్యం

వీరబల్లె : బాలింతలు, గర్భిణులు, పిల్లలకు పౌష్టికాహారం అందించడంతోనే మంచి ఆరోగ్యం పొందవచ్చని ఐసీడీఎస్ సీడీపీఓ సుగుణ తెలిపారు. సోమవారం సీతంపేట సెక్టార్ ఏరియాలో ఉన్న అంగన్‌వాడీ టీచర్లకు ఓదివీడు పంచాయతీలో ఎర్రంరాజుగారిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహారం మీద సమావేశాన్ని ఏర్పాటు చేశారు. పౌష్టికాహారాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ పౌష్టికాహారంతో ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండవచ్చని, ఆరోగ్యమే మహా భాగ్యమని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల నుండి ప్రభుత్వం సరఫరా చేస్తున్న పౌష్టికాహారాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆర్థిక అక్షరాస్యత జిల్లా అధికారి బాలకృష్ణ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, జీవిత బీమా పథకాలను వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ లలితమ్మ, ఆర్థిక అక్షరాస్యత మండల కౌన్సిలర్ చంద్ర తదితరులు పాల్గొన్నారు.



పౌష్టికాహార ప్రయోజనాలు వివరిస్తున్న సీడీపీఓ

దాహం తీర్చుకున్న వానరం



పుల్లంపేట : మనుషులకే కాదు వానరులకు సైతం నీటి కష్టాలు తప్పడం లేదు. సోమవారం పుల్లంపేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద ఓ వానరం చెట్టుపై కూర్చొని ఆకులు తింటూ దాహం వేయడంతో దిక్కులు చూసింది. ఎక్కడా నీరు కనిపించలేదు. ఇంతలో ఓ వృద్ధుడు చెట్టు కింద కూర్చొని తనవద్ద ఉన్న వాటర్ బాటిల్‌ను తీసుకొని కొంచెం నీరు తాగి వాటర్ బాటిల్‌ను పక్కన పెట్టాడు. ఎలాగైనా దాహం తీర్చుకోవాలన్న తపనతో వానరం ఆ వాటర్ బాటిల్‌పైకి దూకి బాటిల్‌ను తీసుకొని తన దాహాన్ని తీర్చుకుంది.

ఆరోగ్యవంతులే నిజమైన సంపన్నులు

రాజంపేట టౌన్ : ఆరోగ్యవంతులే నిజమైన సంపన్నులని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన రోగులనుద్దేశించి మాట్లాడారు. ప్రస్తుతం విద్యార్థుల నుంచి వృద్ధుల వరకు అందరిది ఉరుకులు, పరుగులమయమైన జీవనమైందన్నారు. అందువల్ల మనిషి ఒత్తిడికి గురవుతున్నారన్నారు. మానసిక ఒత్తిడి వల్ల అనేక ఆరోగ్య సమస్యలు వస్తాయని తెలిపారు. ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించకపోతే మూల్యం చెల్లించుకోవాల్సిన పరిస్థితి వస్తుందన్నారు. దేశ ప్రజలంతా ఆరోగ్యవంతంగా ఉండాలన్న ఆశయంతో ప్రధాని నరేంద్ర మోదీ ఈ కార్యక్రమాన్ని చేపట్టారన్నారు. మున్సిపల్ చైర్మన్ పోలా మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య శ్రేయస్సు కోసం ప్రవేశ పెట్టే ఇలాంటి కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తొలుత ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ పాలనేని వెంకట నాగేశ్వరరాజు ఆధ్వర్యంలో వైద్యులు మున్సిపల్ కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మర్రి రవి, ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు మాధవరెడ్డి, ఎల్లారెడ్డి, బీజేపీ నాయకులు పోతుగుంట రమేష్‌నాయుడు, పిండిబోయిన క్రిష్ణయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వేకోడూరులో..

రైల్వేకోడూరు అర్బన్ : స్వచ్ఛతా హీ సేవలో భాగంగా స్థానిక ఎంపీడీఓ సభా భవనంలో ఉచిత వైద్య శిబిరాన్ని సోమవారం ఏర్పాటు చేసి పరిశుభ్రతపై డాక్టర్ బ్రహ్మకుమారి ప్రజలకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యక్తి గత పరిశుభ్రత పాటించాలని తెలిపారు. అలాగే మన ఇంటి చుట్టుపక్కల ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండేలా బాధ్యత తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు వినయ్, హరికృష్ణ, సాయి, చైతన్యలు హెల్త్ సూపర్‌వైజర్ బాలకృష్ణమరాజు తదితరులు పాల్గొన్నారు.



రైల్వేకోడూరు అర్బన్: శిబిరంలో పాల్గొన్న రోగులు



రాజంపేట టౌన్: వైద్యశిబిరంలో ఆకేపాటి, పోలా

రాజంపేట మున్సిపల్ కమిషనర్‌గా నాగేశ్వరరావు

రాజంపేట : రాజంపేట మున్సిపల్ కమిషనర్‌గా బి.నాగేశ్వరరావును నియమిస్తూ సోమవారం ప్రభుత్వం జీఓ విడుదల చేసింది. ఇక్కడ పనిచేస్తున్న నల్లా రాంబాబు మెడికల్ లీవ్‌లో ఉన్నారు. ఈయన స్థానంలో నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న నాగేశ్వరరావును రాజంపేట కమిషనర్‌గా నియమించారు.

చోరీలు అరికట్టడంలో సహకరించండి

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు విద్యుత్ డివిజన్ పరిధిలోని గ్రామాలలో ట్రాన్సుఫార్మర్ల వద్ద అనుమానంగా తిరుగుతున్న వారిపై అధికారులకు సమాచారం ఇవ్వాలని డీఈ భాస్కర్ రావు సోమవారం తెలిపారు. విద్యుత్ శాఖ పరిధిలోని నాగవరం, ఓబనపల్లి తదితర గ్రామాలలో ట్రాన్సుఫార్మర్లను పగులకొట్టి కాపర్ వైర్‌ను దొంగలిస్తున్నారని చెప్పారు. ముమ్ముందు ఇలాంటి చోరీలు జరగకుండా విద్యుత్ సమస్యలు రాకుండా ఉండాలంటే ప్రతి ఒక్కరూ బాధ్యత వహించి ఆయా రైతులు, వినియోగదారుల పరిధిలోని ట్రాన్సుఫార్మర్ల వద్ద అనుమానంగా తిరిగితే వెంటనే సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

బాల్య వివాహాలు అరికట్టడం అందరి బాధ్యత

లక్కిరెడ్డిపల్లె : బాల్య వివాహాలను అరికట్టడం మనందరి బాధ్యతని సమత ఫౌండేషన్ సభ్యురాలు అమృత తెలిపారు. సోమవారం మండలంలోని స్థానిక పాఠశాలలో బాల్య వివాహాలకు వ్యతిరేకంగా పిల్లలతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సంస్థ కైలాస్ సత్యార్థి చిల్డ్రన్ ఫౌండేషన్ సహకారంతో నడుపుతున్నట్లు చెప్పారు. అనంతరం అమృత మాట్లాడుతూ బాల్య వివాహాలు అరికట్టే బాధ్యత భవిష్యత్తు తరాలైన పిల్లలపై ఉందన్నారు. బాల్యం అనేది దేవుడు ఇచ్చిన గొప్ప వరమని, బాల్యంలో బాగా చదివి భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని సూచించారు. ఎవరైనా బాల్య వివాహం చేస్తున్నట్టు సమాచారం ఉంటే 1098 నెంబర్‌కు డయల్ చేసి తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నైనాదీశ్వర ఆలయంలో పూజలు



ప్రత్యేక అలంకారంలో కామాక్షమ్మ

పెనగలూరు : మండల కేంద్రంలోని పురాతన నైనాదీశ్వరుడి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కామాక్షమ్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజా కార్యక్రమాలు చేశారు. పెద్దఎత్తున భక్తులు ఈ పూజలలో పాల్గొని తమ మొక్కులు చెల్లించుకున్నారు.

వలంటీర్ల వ్యవస్థను కొనసాగించాలి

కేవీపల్లె : గ్రామ వలంటీలర్ల వ్యవస్థను యథావిధిగా కొనసాగించాలని, పెండింగ్‌లో ఉన్న జీతాలు చెల్లించాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు టి.ఎల్. వెంకటేష్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ కూటమి నాయకులు తాము అధికారంలోకి వస్తే గ్రామ వలంటీర్ల జీతాలు రూ. 5 వేల నుంచి రూ. 10 వేలకు పెంచుతామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వంద రోజులు పూర్తి అయినా వలంటీర్ల వ్యవస్థపై ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పష్టత లేకపోవడంతో వలంటీర్లు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. గ్రామ వలంటీర్లు ఐక్యమత్యంతో పోరాడాల్సిన అవసరం ఉందని తెలిపారు.

సీజనల్ వ్యాధులతో జాగ్రత్త

కలకడ : సీజనల్ వ్యాధులతో జాగ్రత్తగా ఉండాలని జిల్లా జాతీయ ఆరోగ్య మిషన్ పర్యవేక్షకులు (డీపీఎంఓ) డాక్టర్ రియాజ్‌బేగ్ సూచించారు. సోమవారం మండలంలోని కలకడ పీహెచ్‌సీ పరిధిలో గుడిబండ హెల్త్‌వెల్‌నెస్ సెంటర్‌ను, 104 సేవలను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీపీఎంఓ మాట్లాడుతూ 104 వైద్యసేవలను గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.